# వారసుడు

జంధ్యాల సాహితి

రైలు వేగం పుంజుకుంది. కిటికీ దగ్గర కూర్చుని తిలక్ వారపత్రిక చదువుతున్నాడు. టైం ఐదు కావొస్తుంది. చలికాలం అవటంతో చుట్టూ చీకటి కమ్ముకుంది.

ఎక్కడో గాని సిగరెట్‌పొగ వాసన తన ముక్కుపుటాలకి తాకింది. కొద్దిగ అటు ఇటు చూసాడు. అప్పర్ బెడ్ మీదనున్న అరవై ఏళ్ల తాత కాలుస్తున్నాడు. తనకి ఆ వాసన పడదు. కడుపులో తిప్పుతున్నట్టుగా వుంది. లేచి డోరు దగ్గిరి కెళ్లాడు తిలక్.

కొద్దిగ తెరుచుకున్న కిటికీల గుండ చల్లటి గాలి లోపలికి వస్తూ శరీరానికి తాకి ఎంతో హాయిగ వుంది తనకి. కాసేపు నిలుచుని వెళ్ల బోతు మూలుగు వినిపించి ఆగి చూసాడు. డోరు దగ్గరగ ఎవరో ముసుగు పెట్టి పడుకుని చలికి తట్టుకోలేక కాబోలు వంటిమీద నున్న బట్ట చాలక మూలుగుతున్నది. ఎవరో ముసలావిడ అయ్యి వుంటుంది అనుకొని తన దగ్గర వున్న శాలువ తీసుకొచ్చి...అవ్వా...అవ్వా అంటూ శాలువ ఆమె మీద కప్పాడు. ఆమె కొద్దిగా కదిలింది. తను అనుకున్నట్టు ముసలావిడ కాదు. ఇరు వది, ముప్పయి ఏండ్లలోపు వుండవచ్చు. తలంత చింపిరిగా వుంది. బట్టలు మాసిపోయి చినిగి, దాగిన ఆమె పొంగులు దాగలేక, దాచుకోలేక ఆమె అవస్థపడటం చూసి జాలితో తన మనస్సు నిండిపోయింది. ఆమెను చూస్తే అనాథలాగ అనిపించింది-కాని ముష్టి ఆవిడ మాత్రం కాదు. తను ఇచ్చిన శాలువ తీసుకుని కృతజ్ఞత చెప్ప తున్నట్టుగ ఆమె తనవైపు చూసింది...కానీ ఆమె కళ్లలో కాంతి లేదు-ముఖంలో మెరుపు లేదు. కానీ ఏదో తెలియని ఆకర్షణ మాత్రం ఆమెలో ఇమిడి వుందని కొద్దిగా గ్రహించాడు.

రెండు నిమిషాలు అక్కడవుండి ఆ తరువాత వచ్చి సీట్లో కూర్చొన్నాడు. ఏడు, ఏనిమిది అవుతుం డగ మీల్స్‌కి ఆర్డరిచ్చాడు. రెండు ప్లేట్లకి. ఒకటి తనకి ఒకటి ఆమెకి.

పదకొండు దాటింది అందరు నిద్రలోకి జారుకొ న్నారు. తనకి నిద్ర రావడం లేదు. పెళ్ళి చూపులకి ఇంటికి మద్రాసు వెళ్లుతున్నాడు. తనకి పెళ్లంటే ఇష్టంలేదు. ఎవ్వరినీ ప్రేమించనూ లేదు. అమ్మ నాన్న బలవంతం మీద చేసుకుంటున్నాడు. తనకి ముప్పయి ఏండ్లు-ఒక్కడే కొడుకు. ఆస్తి వుంది. వాళ్లకా వయస్సు అయిపోయింది. ఆ యింటికి వారసులుండరని భయం. నిజమే మరి. అందులో పెళ్లి చేసుకోవాలిగ మరి. కాదనలేక హైద్రాబాదు నుండి మద్రాసు బయలుదేరాడు తను. వాళ్లు ఏ పిల్లని చూసి చేసుకోమన్న చేసుకుంటాను. ఏవేవో

ఆలోచనతో ఎప్పటికో గాని నిద్రపట్టలేదు తిలక్‌కి.

తెల్లవారింది. స్టేషన్‌లో దిగేవాళ్లు దిగుతున్నారు. తను దిగాడు. ఆవిడ మాత్రం అలాగే పడుకొని వుంది. ఎవరో వచ్చి దిగమని కొడుతున్నారు. ఏడుస్తూ, భయంతో బండి దిగింది ఆమె. తను ఇచ్చిన శాలువాతో వంటిని దాచుకోవటానికి ప్రయత్నిస్తున్నది.

అందరు వెళ్ళిపోయారు. తనెందుకో కదలలేక పోయాడు. ఇంకా అక్కడే వున్నాడు. ఆమెను చూస్తే పాపం అనిపిస్తున్నది. పెద్దిల్లు ఆస్తి తనకి, అమ్మకి వయస్సయిపోయింది. నాన్నకి ఆరోగ్యం బాగుండదు. వాళ్లకి దూరంగా ఉద్యోగ రీత్యా ఇక్కడ హైద్రాబాద్‌లో వుంటున్నాడు. తను పెళ్లయిన భార్యతో ఇక్కడే వుంటాడు గానీ మద్రా సులో కాదు కదా! ఎప్పడో అమ్మ చెప్పింది తనకో నమ్మకమైన మంచి మనిషిని చూసి ఇంట్లో పెట్ట మని. ఇప్పడు ఈమెని తీసుకొని వెళ్లి...ఆలోచించి ఆమెతో...

నీకు ఎవ్వరు లేరా?..అడిగాడు తిలక్.

లేరు అని తల వూపింది ఆమె...

మరి నీవు ఎక్కడికి వెళతావు?

మళ్లీ ఆమె ఏమోనన్నట్టు చూసింది తనవైపు.

అయితే నేను మా యింటికి తీసుకెళ్లి పని ఇప్పిస్తా. కడుపునిండా భోజనం దొరుకుతుంది. ఏమంటావు మళ్లీ అడిగాడు.

ఏదో ఆలోచిస్తున్నట్టుగా తనకి అనిపించింది. ఆమె ఏ సమాధానము, సైగ చెయ్యలేదు. ఆమె భయం ఏమిటో తనకి కొద్దిగ అర్థమైంది.

మా యింట్లో అమ్మ, నాన్న వుంటారు. అంతే నేను వుండను. ఇల్లంతా నీవే చూసుకోవాలి. మావాళ్లు బాగా చూసుకుంటారు నేకేమి భయ మక్కర్లేదు...అని ఆమె వైపు చూసాడు...ఈసారైనా సమాధానము దొరుకుతుందేమోనని...

ఆమె మెల్లగ అంది. నాకు ఎవ్వరూ లేరు. మీతో వస్తాను అని బయలు దేరింది తనతో.

నీపేరు అడిగాడు తిలక్.

కళ్యాణి...అని చెప్పింది.

చక్కటిపేరనుకున్నాడు తను.

* * * * *

తిలక్ పెళ్లయి మూడు సంవత్సరాలు దాటింది. తను భార్యతో హైద్రాబాద్‌లో వుంటున్నాడు. మద్రా సులో అమ్మనాన్నల దగ్గర తోడు నీడగ అన్ని పనులు చూసుకుంటూ వాళ్లలో ఒకరిగా వుండిపోయింది కళ్యాణి.

కళ్యాణి ఓర్పు, మంచితనం నచ్చటంతో అమ్మకి బాగా దగ్గరైపోయింది. తను చేసిన పని తప్పలేద నిపించింది.

తన భార్య లలితకి పిల్లలు వుట్టరన్న విషయం తెలిసి నాన్న దిగులుతో పోయాడు. ఇక ఈ ఇంటికి వారసులు వుండరేమోనని తల్లికూడ దిగు లుతో సగమైపోయింది. పిల్లలకోసం మొక్కని దేవుళ్లు, చేయని పూజలు లేవు. కానీ ఏం లాభం? లిఖితంలో లేరు అని తెలిసినప్పడు!...

నెలకి రెండుసార్లు మద్రాసువెళ్లి తల్లిని చూసి వస్తుంటాడు తిలక్. సంవత్సరం గడిచింది. తల్లి దిగులుతో మంచం పట్టింది. కళ్యాణి దగ్గర వుండి అన్నీ చూసుకుంటున్నది.

కళ్యాణి తప్పటడుగు వేసిందని అమాయకంగా కనబడే ఆమె ఇంత నీచానికి దిగజారిందని అందుకే అసహ్యంతో ఆమెను ఇంట్లోంచి పంపించి వేరే ఆమెను పెట్టుకున్నాను అని అమ్మ తనకి లెటర్ వ్రాయడంతో మద్రాస్ బయలుదేరి వెళ్లాడు తిలక్.

మంచంలో పడుకున్న తల్లిని చూసి...నీకు జ్వరం వచ్చిన విషయం కూడ నాకు వ్రాయలేదంటమ్మా... అంటూ కన్నీళ్లు పెడుతున్న కొడుకుని చూసి, బాధతో నాకు జ్వరం వచ్చిందని నీవు బాధపడుతు న్నావు కానీ..ఇన్నాళ్లు ఎంతో నమ్మకంగ విశ్వాసంగా వుంటున్న కళ్యాణి ఇలా చేసినందుకు నేనెంత బాధపడుతున్నానలో నీకు తెలియదు బాబు అంటూ వస్తున్న ఏడుపుని ఆపుకొంటూ అన్నది తల్లి. కళ్యాణి విషయం అడిగి తల్లిని బాధ



పెట్టకూడదని ఊరుకున్నాడు తను. రేపు ప్రయాణ మనగ తనతో చిన్నప్పటి నుంచి కలిసి చదువుకున్న రాంబాబుకి యాక్సిడెంట్ అయి దెబ్బలు తగిలాయని తెలిసి హాస్పిటల్‌కి వెళ్లి చూసాడు. కాసేపు అతనితో మాట్లాడి ఇంటికి బయలు దేరాడు తను. హాస్పిటల్ ఆవరణలో నర్స్ వేషంలో వున్న కళ్యాణిని చూసి ఆశ్చర్యంతో ఆమె దగ్గరికి వెళ్లి పలకరించాడు.

తన పలకరింపుతో కళ్యాణి ఎంతో సంతోష పడి ఏదో ఆరాధనగా మౌనంగా తనని మూగగా చూసింది.

ఆ చూపులో ఎన్నో అర్థాలు, భావాలు దాగివున్నాయని తనకి తెలుసు.

తన తల్లి చేసినపనికి తను క్షమాపణ చెప్పకుని ఆమెకు ఏలోటు రాకుండా ఏర్పాటుచేసి హైదరాబాద్ వెళ్లాడు తిలక్ ఆ మరునాడు.

పిల్లలు తనకి పుట్టరని తెలిసి లలిత తనని వేరే పెళ్లి చేసుకోమంది. తన తల్లి ఇక యింటికి వారసులే వుండరేమోనని ఇంతటితో ఈ వంశం అంతం అవుతుందని భయం. ఇద్దరితో తను ఏం చెయ్యలేక నలిగిపోతున్నాడు.

అప్పడప్పుడు మద్రాస్ వెళ్లినప్పడల్లా కళ్యాణిని కలిసి ఆమె క్షేమం తెలుసుకుని వస్తుంటాడు తను. ఆమెకిప్పుడు నెలలు నిండాయి. నర్సింగ్ హోంలో జాయిన్ చేసి లేడి డాక్టర్‌తో చెప్పివచ్చాడు తను.

నెల రోజుల తరువాత మద్రాస్ నుంచి టెలిగ్రాం వచ్చింది తల్లికి సీరియస్‌గా వుందని.

భార్యని తీసుకొని మద్రాస్ వచ్చాడు తిలక్.

చావు బ్రతుకుల మధ్య ఊగిసలాడుతున్న తల్లిని చూసి చిన్న పిల్లవాడిలాగ ఏడ్చాడు తను. తనకి పిల్లలు వుట్టలేదనే తెలుసు తల్లికి గానీ, లలితకి అసలు పిల్లలు వుట్టే అవకాశమే లేదని ఇంతవరకు చెప్పలేదు. ఎప్పటికైన వుడతారని ఆమెకి ఆశ. కొద్దిగ మతి భ్రమించినదని డాక్టర్లు చెప్పారు తనకి. ఆరోజు సాయంత్రందాక ఆమెకి స్పృహ రాలేదు.

కొద్దిగ ఆమెకి మెలకువ వచ్చిన తర్వాత కళ్లు తెరిచి చూసింది. ఎవ్వరిని గుర్తు పట్టలేదు. ఏవో పిచ్చిచూపులు చూస్తూ కూర్చొంది. ఆమె అలా మారటానికి తనే కారణమని మనవడికోసం ఆమె తపించి అలా మతిచలించినదని తెలిసి బాధలో కుళ్లి కుళ్లి ఏడ్చాడు తిలక్.

ఆమె కోరిక తీర్చినట్లైతే మళ్లీ మామూలు మనిషి అవుతుందని డాక్టర్లు చెప్పారు.

ఆరోజు రాత్రి లలితతో మాట్లాడి ఒక నిర్ణయానికి వచ్చాడు తిలక్.

ఆ మరునాడు నెలరోజులోవు బాబుని తీసుకుని వచ్చి తల్లిచేతిలో పెట్టి ఈ ఇంటికి వారసుడమ్మా! చూడు...నీ మనవడు అంటూ ఆమెను చూసాడు..ఆశగా...

ఆ మాటలు విని వెంటనే కళ్లు తెరిచి..తన చేతిలో వున్న పసికందుని చూసి...ఈ బాబు నా మనవడే..ఈ ఇంటికి వారసుడు పుట్టాడన్నమాట. ఇక నాకు ఏ రోగము లేదు. నా మనవడు వచ్చాడుగ. నేను వాడితో ఆడుకొంటాను. అంటూ బాబుని ముద్దులతో ముంచుతూ...న

**దావులున్న** తల్లిని చూసి భయంతో ఒకవైపు, సంతోషంతో మరోవైపు చూస్తూ బాబుని తీసుకున్నాడు. కాసేపు అలాగే వుంటే మతి స్థిమితం లేకపోవటంతో బాబుని ఏమైన చేయవచ్చునని భయపడుతూ బాబుని తీసుకొని లలితకిచ్చాడు. కాసేపు అలాగే ఆరుస్తూ మళ్లీ స్పృహ కోల్పోయింది తల్లి. ప్రాణానికేం ప్రమాదం లేదని కొద్దిగా మతి భ్రమించిందని కోలుకోవటానికి టైం పడుతుందని డాక్టర్లు చెప్పారు.

ఈ బాబు కళ్యాణి కొడుకని, ఎవ్వరూ లేని ఈ బాబుని మనం దత్తత చేసుకుంటే మనవంశం నిలబడుతుందని భార్యతో చెప్పాడు తిలక్. లలిత భర్త మాటలకి ఏనాడు ఎదురు చెప్పి ఎరుగదు. కళ్యాణి బాబుకి తల్లి కాబట్టి కొన్ని నెలలు పాలివ్వటం కోసం మన ఇంట్లోనే వుంటుంది. ఆ తరువాత మన ఇష్టం. కళ్యాణిని చూస్తే అమ్మకి మళ్లీ కోపం రావచ్చునని భయంతో హైదరాబాద్ పంపించాడు తిలక్ తన ఇంటికి.

మంచిరోజు చూసి బాబుని దత్తత తీసుకున్నారు తిలక్ దంపతులు.

చాలాచోట్ల తను విన్నది పిల్లలు లేకపోతే వేరే పిల్లలని దత్తత తీసుకోవడం తనుకూడా చూసాడు.

కానీ తనరక్తం, తన కన్నకొడుకుని తనే తన ఇంటికి వారసుణ్ని చేయటం కోసం దత్తత తీసుకోవడం నిజంగ ఆశ్చర్యంగాను, ఆనందంగాను వున్నది తనకి. విధి ఆడే ఆటల్లో ఇది ఒక ఆట కాబోలు.